# సూపర్ మామ్

లేడీ డాక్టర్ మా రెండున్నర నెలల హవీష్‌ని పరీక్షిస్తోంటే ఉత్కంఠతో చూస్తున్నాం నేనూ మా ఆవిడా.

"ఎలా వున్నాడు డాక్టర్? హార్ట్ బీట్ బావుందా? ఎదుగుదల సక్రమంగా వుందంటారా? ఏవిటో పాలు ఎక్కువగా తాగటం లేదు. ఎక్కువ సేపు నిద్రపోతున్నాడు. ఒక్కోసారి..." మా ఆవిడ 'వాయస్ ఓవర్'ని ఆపమని సైగ చేసింది డాక్టర్.

మొఖం ముడుచుకుంది నీరజ.

నర్సు సాయంతో బాబు పొడుగు కొలిచింది. బరువు చూసింది. నోరు కళ్ళు పరీక్షించింది.

"అంతా నార్మల్‌గానే వుంది కదా?" ఆత్రం అణచుకోలేకపోయింది మా ఆవిడ. నాకూ అలాగే ఉండటంతో తలాడింపుతో వంత పాడాను.

"పెర్‌ఫెక్ట్‌లీ ఆల్ రైట్..." మందహాసం చేస్తూ చెప్పింది. 'హమ్మయ్య' అని నిట్టూర్చాను.

"కాని డాక్టర్, పాలు ఎక్కువగా తాగటం లేదు..."

"వాడిది పిట్ట పొట్ట. ఈ ఏజ్‌లో అలాగే వుంటారు..."

"బరువస్సలు పెరగటం లేదు. ఏవైనా టానిక్కులు రాసిస్తే..."

"ఏమీ అక్కర్లేదు. తల్లి పాలు అమృతంతో సమానం. బిడ్డకు కావాల్సినవన్నీ అందులోనే వున్నాయ్..."

"కాని బరువు.....'

"అధిక బరువంటే అనారోగ్యాన్ని కోరుకున్నట్టే. పిల్లాడు చక్కగా వున్నాడు. ఇలాగే ఉండనివ్వండి చాలు..." చెప్పింది డాక్టర్

హతాశురాలై నన్ను మోచేత్తో పొడిచింది నీరజ.

"గ్రోత్ బాగుండటానికేవైనా డ్రాప్స్... టానిక్స్ రాయండి డాక్టర్..." రిక్వెస్ట్ చేశాను.

"ఏమీ అక్కర్లేదు... ఓకే బోయ్..బై..." బాబిగాడి బుగ్గని సున్నితంగా నొక్కుతూ చెప్పింది డాక్టర్.

హావీష్ కిలా కిలా నవ్వాడు. మేం ముఖం మాడ్చుకుని బయటి కొచ్చాం.

"ఈవిడకేం తెలీదు. ఎప్పుడో పాతికేళ్ళ క్రిందట ఎంబిబియస్ చదివింది. లేటెస్ట్‌గా వచ్చిన కొత్త టెక్నిక్కులూ కొత్త పరిశోధనలూ ఈవిడకేం తెలుస్తాయి!" పెదవి విరుస్తూ చేతులు తిప్పుతూ అంది నీరజ.

"పాయింటే గాని వీళ్ళూ మెడికల్ జర్నల్స్ తిరగేస్తూ లేటెస్ట్ ట్రెండ్ ఫాలో అవుతూంటారు. అదీ గాక ఎక్స్‌పీరియన్స్ బాగా ఉపయోగపడ్తుంది కదా" డాక్టర్ని సమర్థించడానికి ప్రయత్నించాను.

"మీకస్సలు తెలీదు. వీధికో సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ ఉంది. అక్కడికి తీసుకెళ్ళకుండా ఈ ముసలి చిల్డ్రన్స్ స్పెషలిస్టు దగ్గరకి తీసుకొచ్చినందుకు మిమ్మల్ని అనాలి ముందు..." డాక్టర్ మీది కోపం నా మీద చూపించింది.

నోరు తెరిస్తే గాలిదుమారంగా మారవచ్చన్నది స్వానుభవం గనుక మౌనాన్నాశ్రయించాను.

"డాక్టరమ్మ ఏమందర్రా" గుమ్మంలోనే అడిగింది మా అమ్మ.

"ఆవిడా మీలాగే చాదస్తం కాదు చాదస్తంన్నర మనిషి. ఏమీ వాడక్కర్లేదుట! బాగానే వున్నాట్ట! అక్కడికి బాగంటే ఏవిటో ఆవిడొక్కదానికే తెలిసినట్టు!"

నీరజ రుసరుస లాడుతోంటే బుగ్గలు నొక్కుకుంది అమ్మ. "నీ పెళ్లాం చదివింది ఇంటరే కదరా. అది కూడా పూర్తి చెయ్యనేలేదు. డాక్టర్లా మాట్లాడుతుందేవిటీ!" అంది నాతో గుసగుసగా.

అయినా నీరుకి విన్పించింది. తనవి పాము చెవులాయె!

"నా మీద మీ కొడుక్కి బాగా నూరి పొయ్యండి. వెన్నముకే లేదా మనిషికి. నా కొడుకుని మీ కొడుకులా పెంచను. చూస్తూ వుండండి సూపర్‌మేన్‌ని చేస్తాను" ఓ సవాల్ విసిరింది నీరజ.

"గోడలూ బిల్డింగులూ ఎక్కిస్తావా ఏవిటే!" అనుమానంతో ఆశ్చర్యంగా నోరెళ్ళ బెట్టింది అమ్మ.

"అలాటి సూపర్‌మేన్ కాదు. శక్తిలో యుక్తిలో చదువులో సంధ్యలో నెంబర్ ఒన్‌ని

చేస్తాను. ఏడాదికి లక్ష రూపాయలు ఫీజున్న స్కూల్లో చేరుస్తాను. 'హవీష్, ది గ్రేట్' అన్పించుకునేలా తీర్చి దిద్దుతాను...!" ఆవేశపడింది నీరజ.

"బావుంది సంబడం. లోకంలో నీ కొక్క దానికే కొడుకున్నాడు. ఈ భూమ్మీద నువ్వే మొదటి తల్లివి!"

"మొదటి తల్లిని కాదు సూపర్ మామ్‌ని" కళ్లల్లో గర్వం తొణికిసలాడుతోంటే గొప్పగా చెప్పింది.

మూతి ముప్పై వంకర్లు తిప్పింది అమ్మ.

అటు తిరిగి ఇటు తిరిగి పిడుగు నా మీద పడ్తుందేమో నన్పించి హవీష్‌ని ఎత్తుకుని ముద్దు చేస్తూ గదిలో కెళ్లిపోయాను.

స్నానం చేస్తోంటే తలుపు బాది "అర్జంట్‌గా బయటికి రండి చెప్తా" అరిచింది నీరజ.

ఏం కొంపలు మునిగాయోనని టవల్ చుట్టుకునొచ్చాను. టీవీ వంక చూపిస్తూ "చూడండి చూడండి మళ్ళీ వస్తుంది...చూపు తిప్పొద్దు" అంది.

ఒక చిన్న బాబు-బొద్దుగా ముద్దుగా వున్నవాడు-వెండి గిన్నెలోని పేస్ట్‌ని ఎంతో ఇష్టంగా మరెంతో ఆత్రంగా తిని కేరింతలు కొట్టాడు. ఆ తల్లి తెగ మురిసిపోయి "నా చిన్ని క్రిష్ణ" అంటూ ముద్దాడి మెటికలు విరిచింది.

"ఆ బాబుది రెండేళ్లే అట. మన హవీష్ కన్నా ఆరోగ్యంగా వున్నాడు కదూ. సెరిఫుడ్ పెడుతున్నార్ట. మనమూ స్టార్ట్ చేద్దాం. వారం రోజుల్లో టీవీ కుర్రాడ్ని మించిపోవాలి..."

"బాగానే వుంటుంది గాని డాక్టరమ్మ..."

"ఆవిడకేం తెలీదు. సాయంత్రం ఆఫీసు నుంచొచ్చేసరికి సెరిఫుడ్ డబ్బా పెద్దది తీసుకురండి" ఆర్డరేసింది. 'అలాగే' అంటూ తలాడించాను.

"పెళ్లాం చెప్పడమూ నువ్వు గంగిరెద్దులా తలాడించడమూ బావుందిరా అబ్బాయ్ నీ వరస. అన్న ప్రాశన చేయించకుండానే ఏదేదో పెట్టేస్తానంటారేవిట్రా ఖర్మా!" అంది అమ్మ.

"ఇది కర్మల కాలం కాదు క్రియల కాలం. ఏం పెట్టాలో మాకు తెలుసు. దయచేసి మీ పాత చింతకాయ పచ్చడి కబుర్లు నా బిడ్డ మీద రుద్దకండి..." అంది గబుక్కున

బాబుని ఎత్తుకుని లోపలికి తీసుకెళ్తూ.

మా అమ్మవంక చూళ్ళేక బాత్‌రూంలో దూరాను.

బాబుకి సెరిఫుడ్ పెడుతున్నాం. కష్టం మీద మింగుతున్నాడు. అదే పదివేలనుకు ఇద్దరం తృప్తిపడుతున్నాం. కాని ఆ దృశ్యం మాత్రం మా అమ్మ కంటబడకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నాం.

నీరజ ఫ్రెండ్ చాముండేశ్వరి వచ్చింది తన ఆర్నెల్ల కూతుర్నెత్తుకుని. ఆవిడ్ని పలకరించి ఆమె బిడ్డని చేతుల్లోకి తీసుకున్నాను. ఇనుప గుండులా బరువుగా వుంది.

ఇబ్బంది పడ్తూనే మోస్తూ ఏవేవో కబుర్లు చెబుతూ నేను ఆడిస్తోంటే ఆడవాళ్ళు కబుర్లలో పడ్డారు.

"నీ సన్ ఇంత సన్నగా వున్నాడేంటి? మీరేమీ కాస్ట్లీ ఫుడ్స్ వాడటం లేదా?" యమాశ్చర్యపోతూ అడిగింది చాముండేశ్వరి.

"మొన్ననే సెరిఫుడ్ మొదలెట్టాం చామూ... ఇంకేం వాడమంటావో కాస్త చెప్పి పుణ్యం కట్టుకోవే. మా ముసలి డాక్టరు మా అత్తగారి లాటిదే. ఏవీ వద్దే వద్దు అంటుంది" కంప్లయింట్ చేసింది నీరజ.

"వాళ్ళని నమ్ముకుంటే మన పిల్లలు వెనకబడిపోతారు. ఇవాళ రేపు డాక్టర్లు కమీషన్లొచ్చే మందులే రాస్తున్నారు. మొన్న సండే పేపర్లో చిన్న పిల్లలకి విటమిన్లు మినరల్స్ కాల్షియం అధికంగా వుండే ఫుడ్ పెట్టాలని ఎడ్వైజ్ చేశారు. నువ్వు చదవలేదా?"

"ఊహుఁ. పేపర్ చదివేంత తీరిక నాకెక్కడిదీ. మా అత్తగారితోనే సరిపోతోంది నా పుణ్యకాలమంతా!" దీర్ఘం తీసింది.

అమ్మ ఊసొచ్చేసరికి తను రంగంలోకి దిగిపోయింది. "ఆడలేక మద్దెల ఓటు అన్నదంట వెనకటికెవతో నీలాంటిది. బిడ్డను పెంచడం చేతగాక మధ్యన సన్ను ఆడిపోసుకుంటావెందుకూ!" అంటూ.

"ఉన్నమాటంటే వులుకెందుకూ! మీ అబ్బాయి నెలా పెంచారో చూస్తూనే వున్నాంగా. ఒక ఇంజినీరుగా ఒక డాక్టర్‌గా చెయ్యలేక ఎన్జీవోని చేశారు. నా ఖర్మ కొద్దీ మా వాళ్ళు ఈయన కిచ్చి కట్టబెట్టారు!"

"అబ్బో. ఈవిడ పుట్టింటి వాళ్ళు మహారాజులు ఈవిడగారేమో యువరాణీనూ! కాపురాని కొచ్చినప్పుడే కావిడి సారె తేలేదు గాని గొప్పలు చెబుతోంది చూడండి సిగ్గూ

ఎగ్గూ లేకుండా!"

వారి మధ్యలోకి తలదూర్చక తప్పలేదు. "అమ్మా! నీకేం తెలీదు. నువ్వూరుకో. బయటి వాళ్ళ ముందు గొడవెందుకు చెప్పూ" అన్నాను.

విడ్డూరంగా చూసింది అమ్మ నా వంక.

"పెళ్లానికి చెప్పడానికి నోర్రాక నన్నంటావా. అనరా అను. నవమాసాలు మోసి కన్నందుకు అష్ట కష్టాలుపడి పెంచినందుకు బాగానే ఋణం తీర్చుకుంటున్నావురా. అయినా నిన్నని లాభం ఏవిట్లే నా కర్మిలా కాలింది. ఆయనే బతికుంటే...!" నాన్నని తలుచుకుంటూ కళ్ళొత్తుకుంటూ పెరట్లో కెళ్ళిపోయింది.

"అక్కడికి ఆయన బతికున్నప్పుడు తిన్నగా బతకనిచ్చినట్టు. ఈవిడ నోరెంత పెద్దదో ఈ వాడ వాడంతటికీ తెల్సు!" చేతులు చాచి మరీ బిగ్గరగా అంది నీరజ.

ఆమె మాటలకి ఇబ్బంది పడ్తూనే, "ఆ గొడవకేం గాని మన హాపీష్ గురించి చాముగారేమైనా మంచి ఐడియా చెబుతారేమో.....మీ అమ్మాయికి మీరేం పెడుతున్నారండీ" అంటూ డైవర్ట్ చేశాను.

"మా వారికి హెల్త్ గురించి బాగా తెలుసు. పేపర్లలో పుస్తకాల్లో ఎక్కడ మంచి పాయింటు దొరికినా వెంటనే ఇంప్లిమెంట్ చేసేస్తారు. పుట్టినప్పుడు మా ప్రీతి చిటికెనవేలులా వుండేది తెలుసా? ఇప్పుడిది బొటన వేలులా వుందంటే అదంతా మావారి తెలివి తేటల వల్లే పాజిబులయ్యిందీ"

"చాముా ప్లీజ్... మీరేం వాడారో చెప్పవే. మేమూఁ వాడతాం" తొందరపెట్టింది.

ఆమె చెప్పబోయి ఆగింది. క్షణం ఆలోచించి "గుర్తులేదే. ఫోన్ చేసి చెబుతాన్లే" అని తప్పించుకుంది.

ఆ తర్వాత ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఏవో వంకలు పెట్టింది తప్ప ఒక్కటీ చెప్పలేదు.

"అదో చుప్పనాతి శూర్పణఖ. చిన్నప్పట్నుంచీ ఏడ్చిపోయే రకమే. అక్కడికి దాని కూతురు బేబీ ఇండియాలా వున్నట్టు!"

"బేబీ ఇండియా?"

" 'మిస్ ఇండియా' పెద్ద అందగత్తెలకైతే 'బేబీ ఇండియా' బ్యూటిఫుల్ బేబీలకన్నమాట"

"ఐడియా బావుంది. ఈసారెక్కడైనా బేబీ షోలు అరేంజ్ చేస్తే మన హాపీష్‌ని తీసుకెళ్దాం.

చాలా చురుగ్గా వుంటున్నాడుగా డెఫినిట్‌గా కప్పు కొట్టేస్తాడు"

"అందుకిలా వుంటే చాలదండీ ఇంకా ఒళ్ళు రావాలి. బరువు పెరగాలి. తెలివిగా ప్రవర్తించాలి. అవునూ తెలివితేటలు పెంచే గుళికలంటూ ఇది వరకు టీవీలో ప్రకటనలొచ్చేవిగా ఆ పేరు గుర్తుందా?" అడిగింది.

నేను నీళ్ళు నమిలాను.

"సరస్వతీ ఆకు తినిపించండి నాలిక పల్చబడి చదువు బాగా వస్తుంది" అమ్మ అందుకుంది.

"ఆకులూ కషాయాలూ ఈ కాలానికి సరిపడవు గాని మీ చిట్కా వైద్యాలు మీ దగ్గరే దాచుకోండి. నా బిడ్డ తెలివి తేటల్లో ఆటపాటల్లో ఫస్టొచ్చేలా చేసే మందులు అవసరమైతే విదేశాల నుంచి తెప్పిస్తాను. ఏవిటనుకున్నారో" అంది నీరజ.

"ఉట్టి కెగరలేనమ్మ స్వర్గానికెగురుతాననడం అంటే ఇదే మరి!" చెప్పింది అమ్మ.

నీరజకి ఉక్రోషం వచ్చేసింది. "మీ అమ్మ నన్నలా దెప్పుతోంటే బెల్లంకొట్టిన రాయిలా కూర్చుని చూస్తున్నారేంటి. సిటీ అంతా గాలించి అయినా సరే హవీష్ తెలివి తేటలు పెంచే టానిక్కులేంటో కనుక్కోండి. వాడు ఐఐటీయన్ కావాలన్నది నా డ్రీమ్.."

"మొన్న టీవీలో మ్యాచ్ చూస్తూ క్రికెటర్ని చేస్తానన్నావు?!"

"అదీ అవుతాడు. ఇంజినీర్లు క్రికెట్ ఆడకూడదా ఏవిటి. నా బుజ్జి కొండ సవ్యసాచి" బాబు మీద ముద్దుల వర్షం కురిపించగా వాడికి భవిష్యత్తు గుర్తొచ్చి భయమేసిందో ఏమో కెవ్వుమన్నాడు.

ఒక పెళ్ళిలో మా ఆఫీసరుగారి భార్యని పలకరించే అవకాశం దొరికింది. వారి పిల్లలంతా అమెరికాలో వుంటున్నారంటే ఎంత తెలివైన వాళ్ళో ఊహించుకోవచ్చు.

"మా అబ్బాయి అన్ని విధాలా చక్కగా ఎదగటానికి బంగారంలాంటి సలహా ఇవ్వండి మేడం" అన్నాను చేతులు నలుపుకుంటూ.

ఆవిడ నన్ను ఆది మానవుడిలా చూసి "వెల్‌బేబీ క్లినిక్ వుందిగా! విన్లేదా? అమెరికా వాళ్ళది. అమెరికా అంటే రాజముద్ర కొట్టినట్టే. రేపే వెళ్ళి చూపించండి" అందామె.

నా అజ్ఞానానికి సిగ్గు పడ్డాను. మర్నాడు ఆఫీసుకి శలవు పెట్టి మరీ హవీష్‌ని తీసుకెళ్ళాం నేనూ మా ఆవిడా.

వెల్ బేబీ క్లినిక్ ఆసుపత్రిలా లేదు. ఫైవ్‌స్టార్ హొటల్లా వుంది. గోడలకు పిల్లల

నవ్వుల ఫొటోలు, నవ్వుతూ పలకరించే ఆసుపత్రి స్టాఫ్, పరిశుభ్రమైన మరియు నిశ్శబ్ద వాతావరణం.....

'ఇన్నాళ్ళూ దీని గురించి తెలీక పోవటం మా దురదృష్టం' అనుకోకుండా వుండలేకపోయాం.

ఇద్దరు స్పెషలిస్టులు వివిధ టెస్టులు చేసి పెద్ద రిపోర్టిచ్చారు.

సూపర్ పవర్డ్, ఎంజైమో ఫోర్టిఫైడ్, ఫైబర్ బూస్టెడ్, క్రాకిల్ ఎన్‌హేన్స్‌డ్ బ్రేక్‌ఫాస్ట్ సెరియల్స్ – వాడమంటూ పెద్ద లిస్ట్ ఒకటి ఇచ్చారు.

"తెలివితేటలు ఇబ్బడి ముబ్బడిగా పెరగటానిక్కూడా..." ఉబ్బితబ్బిబ్బవుతూ అడిగింది నీరజ.

"యస్. విటమిన్స్, మినరల్స్, కాల్షియం అధికంగా వుండే ఫ్లూయిడ్స్, ఫ్రూట్ జ్యూసెస్ వాడండి' అంటూ మరో లిస్టిచ్చారు.

పరమానందపడిపోయాం.

"మనం మన మెదడులో 40% ఉపయోగిస్తామంట. ఇవి వాడితే హవీష్ 100% వాడతాడు. అంటే సూపర్ పవర్ అయిపోతాడు" అంది నీరజ గాలిలో తేలిపోతూ.

క్లినిక్‌ని ఆనుకుని వున్న వెల్ బేబీ ఫార్మసీలోకి నడిచాం.

'సూపర్ మామ్‌లకు స్వాగతం' అని రాసి వున్న ఆర్చిచూసి గర్వానందంతో నా వంక చూసింది నీరజ. 'ఇదీ మనకి సరైన ప్లేసు' అంది కళ్ళతోనే.

లిస్టు చేతబట్టుకుని ఫస్ట్ ఫుడ్, సెకండ్ ఫుడ్, థర్డ్ ఫుడ్ – రకరకాల కాయగూరల పండ్ల కాంబినేషన్లలో తీసుకుని అన్నింటినీ ట్రాలీలో వేశాం.

పిల్లల ఫ్రూట్ జ్యూస్ బాటిల్స్, విటమిన్ మరియు కాల్షియం డ్రాప్స్ తీసుకున్నాం. ఒంటి మెరుపుకి ప్రత్యేక ఆయిల్స్, తల తద్వారా మెదడు చల్లబడటానికి స్పెషల్ ఆయిల్, స్పెషల్ సోప్, మోయిశ్చరైజర్స్ – అన్నీ ప్రత్యేకమైనవి విదేశీయమైనవి తీసుకున్నాం.

సరుకుల్తో ట్రాలీ నిండిపోయింది. బిల్లు బరువు పెరిగింది. అయినా లెక్క చెయ్యకుండా 'వాయిదాల్లో తీర్చుకోవచ్చులే' అనుకుంటూ క్రెడిట్ కార్డ్ ఇచ్చాను.

మేం కొని తెచ్చిన సరుకుల్నీ డాక్టర్ల ప్రెస్‌క్రిప్షన్ చీటీల్నీ పట్టుకుని ఏ టైంకి ఏది హవీష్‌కి తినిపించాలో టైమ్ టేబుల్ తయారుచేశాం. నిద్రపోతున్నప్పుడు కూడా కొన్ని పెట్టాల్సి వచ్చింది. లేకపోతే ఎడ్జస్టవడం లేదు. అందుకని ఆ టైంలో ఎలావోలా నోరు

తెరిచి డ్రాప్స్ వెయ్యాలని ఫిక్స్ అయిపోయాం.

చోద్యంగా చూస్తోన్న అమ్మ చూపుల్ని పట్టించుకోకుండా ఎలాగైతేనేం మొత్తానికి ఫుడ్ షెడ్యూల్ సక్సెస్‌ఫుల్‌గా పూర్తి చేయగలిగినందుకు మమ్మల్ని మేం అభినందించుకున్నాం.

ఏదో గుర్తొచ్చి నాలిక్కరుచుకుంది నీరజ "నా పాలు తాపించడానికి టైమివ్వడం మరిచి పోయామండీ" అంది.

"అరె. నిజమేనే ఎలా పోలా ఇరికించాలి...లేకపోతే బావుండదు..." అన్నాను.

మరో అరగంట కుస్తీ పట్టి పాలకార్యక్రమాన్ని కూడా చేర్చి సెంచరీ కొట్టినంత సంబరపడ్డాం.

వెంటనే మా ప్లాన్‌ని అమలు చేసేందుకు నడుం బిగించాం.

"వాడు పసి పిల్లాడే ఫారం కోడి కాదు" అంది అమ్మ మా వాలకం చూసి ఆందోళన పడుతూ.

'కయ్' మని అరిచి అమ్మ కంటబడకుండా పిల్లాడికింత ఉప్పూ, ఎండు మిరపకాయలూ దిష్టి తీసేసింది నీరజ.

అమ్మ ఏదో అనబోతే, "అమ్మా! నీకేం తెలీదు కాసేపు నువ్వూరుకోవే" అన్నాను.

"నాకు తెలీదా! ఒకరిద్దర్ని కాదు అయిదుగుర్ని కన్నారా నేనూ!" అంది అమ్మ కోపంగా.

"అప్పుడు ఆముదం తాగిపించావని ఇప్పుడు పట్టించమంటే ఎలా కుదుర్తుంది చెప్పూ. కాలం మారిపోయిందమ్మా. ఇది హైటెక్కుల టైం"

బుగ్గలు నొక్కుకుని గొణుక్కుంటూ వెళ్ళిపోయింది.

మరి వారం రోజులు గడిచాయో లేదో హవీష్‌లో చాలా మార్పొచ్చేసింది. కానది మేం కోరుకున్న మార్పు కాదు.

నిద్ర తగ్గింది. ఏడుపు ఎక్కువైంది. నిద్రలో కూడా అశాంతిగా కదుల్తున్నాడు. ముక్కు కారుతోంది. విరోచనాలవుతున్నాయి. కళ్ళు ఉబ్బరంగా ఉంటున్నాయి. ఉత్సాహం, చురుకుదనం తగ్గి మన్ను తిన్నట్టు వుంటున్నాడు !

"ఇలా వుంటున్నాడేవిటీ?" ఆందోళన పడుతూ చెవిలో రహస్యంగా అడిగింది నీరజ. అమ్మకి వినబడితే రాద్ధాంతం ఖాయం మరి.

"నాకూ ఏవీ అంతుబట్టడం లేదే. మనం మన చిన్నారి హవీష్ మీద ప్రయోగం

చేస్తున్నామేమోనని భయంగా వుంది..."

"అవి అమెరికా వాళ్ళ ఫుడ్స్ అన్నారుగా..."

"అవుననుకో. అవి మనకి.. మన వాతావరణానికి సరిపడతాయంటావా? అక్కడి వాళ్ళు సరిగ్గా పాలివ్వరనుకుంటా కదా?" అడిగాను.

"పాలు సంపూర్ణాహారమని చిన్నప్పుడు చదివాం కానీ...!"

మరి నాల్రోజులు గడవకుండానే హవీష్‌కి ఫెళ్ళున జ్వరం వచ్చింది. కన్నీళ్ళాపుకుంటూ ముసలి డాక్టరమ్మ దగ్గరకి పరుగెత్తాం.

"ఏమైంది? ఏం పెట్టేరు?" ధుమధుమలాడింది.

వెల్ బేబీ క్లినిక్ డాక్టర్లిచ్చిన ప్రెస్క్రిప్షన్ ఆవిడ ముందుంచాం.

"ఇవన్నీ మూడో నెలలోనే పెట్టేశారా? మీరసలు వీడి పేరెంట్సా శత్రువులా?"

దోషుల్లా తలలొంచుకుని నిలబడ్డాం – మరేం చెయ్యాలో తోచక!

"ఇప్పుడైనా కళ్ళు తెరచి తీసుకొచ్చారు. ఇంకా ఆలస్యం చేసుంటే చేజేతులా వీడి డైజెస్టివ్ సిస్టం, ఎక్స్‌క్రిటరీ సిస్టం నాశనం చేసిన వారవుదురు..." అంటూ తిట్టిపోసింది.

"అమ్మగా నేల మీద నడవండి చాలు సూపర్ మామ్‌గా ఎగరొద్దు" అంది.

సిగ్గుతో నిలువునా చితికి పోతూ తలలాడించి హవీష్ వంక వాత్సల్యంతో చూశాం.

"సారీరా కన్నా. మమ్మల్ని క్షమించు...!"

**(స్వాతి సచిత్ర వార పత్రిక 3.8.2012)**